ప్రజాశక్తి
గురువారం 13 జులై 2023

స్టాండింగ్ కమిటీ బృందం పర్యటన

ప్రజాశక్తి-అనంతగిరి: కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బృందం అనంతగిరిలో పర్యటించింది. స్థానిక హరిత రిసార్ట్స్‌లో బస్ చేసి గిరిజన థింసా నృత్యాన్ని ఆశక్తిగా తిలకించారు. థింసా కళాకారులతో కాసేపు ముచ్చటించి గిరిజన జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మధ్యన భోజనం అనంతరం అరకు లోయలో ప్రర్యటించారు.

పర్యటిస్తున్న బృందం సభ్యులు

మెనూ అమలు చేయకుంటే చర్యలు

-ఐటిడిఎ పిఒ అభిషేక్
-ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక పోయిన విద్యార్థులు
-ఉపాధ్యాయులపై ఆగ్రహం

విద్యార్థులకు బోధిస్తున్న పిఒ

ప్రజాశక్తి-హుకుంపేట: ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ పి.ఓ వి.అభిషేక్ హెచ్చరించారు. బుధవారం మజ్జివలస గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసారు. విద్యార్ధుల మెనూ పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులు సాంఘిక శాస్త్రం, గణితం మొదటి పాఠ్యాంశాలోని ప్రశ్నలు వేయగా సమాధానాలు చెప్పక పోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. విద్యా ప్రమాణాలు మెరుగు పడకపోతే ఉపేక్షించనని హెచ్చరించారు. మెనూ తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూసారు. మెనూ సక్రమంగా అమలు చేయక పోవడం, విద్యార్థుల నూరు శాతం హాజరు లేదని ప్రధానోపాయుడుకి షోకాజ్ నోటీస్ జారీ చేస్తామన్నారు. 60 మంది విద్యార్థులు ఆశ్రమ పాఠశాలకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జెవికె కిట్లు పంపిణీ పై ఆరా తీసారు. వంట గదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమాధికారిణి ఎల్.రజని, తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో మెయిన్ రోడ్డు విస్తరణ

- రోడ్డుకిరువైపులా పార్కింగ్ ప్లాట్ ఫామ్
- కాలువల ఆధునికీకరణ
- ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: పట్టణంలోని మెయిన్ రోడ్డును సుందరంగా తీర్చి దిద్ది ప్రజలకు మెరుగైన రవాణా సౌలభ్యం కల్పించడానికి ప్రధాన రహదారి విస్తరణ తో పాటు రోడ్డు పక్కన వాహనాలు నిలిపేందుకు పార్కింగ్, ప్రజలు నడిచి వెళ్లేందుకు ప్లాట్ ఫామ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ వెల్లడించారు. మంగళవారం రాత్రి పాడేరు ప్రధాన రహదారిలో అధికారులతో కలిసి పర్యటించారు. రోడ్డు విస్తరణ పై పరిశీలించారు. మెయిన్ రోడ్ విస్తరణ, పార్కింగ్ ప్లాట్ ఫామ్ పనులు, విద్యుత్ లైన్ల క్రమబద్ధీకరణ తదితర పనులపై సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో రూ.57 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేస్తామన్నారు. ప్రధాన రహదారికిరువైపుల ఉన్న మట్టి రోడ్డులో టైల్స్ వేసి ఆధునీకరిస్తామన్నారు. ప్రధాన రహదారిలో వర్షం నీరు నిల్వ లేకుండా రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద రోడ్డు విస్తరణ చేస్తున్నామని చెప్పారు. దుకాణ యజమానులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆధునీకరణ పనులు చేస్తామని పేర్కొన్నారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న కాలువలను కూడా మెరుగు పరుస్తామని చెప్పారు. రోడ్డు మధ్యలో డివైడర్ పెట్టడానికి రోడ్డు ఇంకా వెడల్పుగా ఉండాలన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న జాతీయ రహదారి ఎక్కడా ఊరు మధ్యలో నుండి వెళ్లదన్నారు. హుకుంపేట, అరకు వ్యాలీ, పాడేరుకు బైపాస్ రోడ్డు వేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న దుకాణదారులకు సౌకర్యవంతంగా ఉండేలా రోడ్డు విస్తరణ చేస్తామన్నారు. జి.మాడుగుల మండలం పెద కిల్తారు, హుకుంపేట మండలం పెదగరువు వద్ద టోల్ గేట్లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, ట్రాన్స్ కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న పిఒ

గిరిజన రైతులకు జీడిమామిడి మొక్కలు పంపిణీ చేస్తున్న ఎఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

గంజాయి సాగుకు స్వస్తి పలకాలి

- గిరిజనులకు ఎఎస్‌పి పిలుపు

ప్రజాశక్తి -సీలేరు

గిరిజనులు గంజాయి పంటలకు స్వస్తి పలికి సాంప్రదాయ పంటలపై దృష్టి సారించాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం దారకొండలో బుధవారం ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గుమ్మరేవులు గాలికొండ, దారకొండ, దుప్పిలివాడ, సీలేరు పంచాయతీ ప్రజలు దీనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ గంజాయి సాగు, అక్రమ రవాణా నిరోధించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, దానికి గిరిజనులు సహాయ సహకారాలు అందించారని కోరారు. చింతపల్లి, దారకొండ, సీలేరు ప్రాంతాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారితో రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. అయితే ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి అక్రమంగా తరలివెళ్లిన గంజాయి హైదరాబాదు ఇతర రాష్ట్రాల్లో పట్టుబడితే దారకొండ, గుమ్మరేవులు, సీలేరు ప్రాంతాల నుంచి గంజాయి వెళ్తుందని పేరు వినపడటం బాధాకరమన్నారు. అందుకే గిరిజనులు గంజాయి సాగు అక్రమ రవాణా పూర్తిస్థాయిలో విడనాడి సాంప్రదాయ పంటలను సాగు చేస్తే తాము సహకారం అందిస్తామని తెలిపారు. గిరిజనులు ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని రాయితీలు వచ్చే విధంగా కృషి చేస్తామని గిరిజనులకు ఎఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు పంచాయతీల గిరిజనులకు 20వేల జీడి మామిడి మొక్కలను పంపిణీ చేశారు. రాజ్‌మా విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జికె.వీధి సీఐ అశోక్ కుమార్, సీలేరు ఎస్సై రామకృష్ణ, జీకే వీధి తహాశీల్దారు ప్రసాద్, డిప్యూటీ తహాశీల్దారు కుమారస్వామి, జీకే వీధి ఎంపీపీ కుమారి, దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు పాల్గొన్నారు.

కెజిబివి ప్రిన్సిపల్‌గా పరిమళ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- కొయ్యూరు

స్థానిక కస్తూరాబాయ్ గాంధీ బాలికల విద్యాలయం (కెజివిబి) నూతన ప్రిన్సిపాల్‌గా పరిమళ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాలయంలో విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తానని, వసతి, సక్రమంగా మెనూ అమలు చేస్తామని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న పరిమళ

సరిహద్దు సమస్యపై సమావేశం

ఇరు రాష్ట్రాల అధికారులు హాజరు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:
ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు నిర్ణయంపై మండలంలోని రాయపాడులోని బుధవారం ఆంధ్ర ఒడిస్సా అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సరిహద్దు నిర్ణయం పై చర్చించినట్లు సబ్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. ఈ సరిహద్దు సమావేశానికి తహసిల్దార్ సిహెచ్ నాగమ్మ, హెచ్‌డిటి ముజీబ్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కిముడు హరి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, అటవీ శాఖ అధికారులు హాజరు కాగా ఒడిశా కోరాపుట్ సబ్ కలెక్టర్. నందాపూర్ ఎస్‌డిపిఓ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు హాజరైనట్లు చెప్పారు.

హాజరైన ఇరు రాష్ట్రాల అధికారులు

మానవహారం నిర్వహిస్తున్న గ్రామ వాలంటీర్లు

శంకుస్థాపన అనంతరం మాట్లాడుతున్న జడ్పిటిసి గంగరాజు

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలో మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధే దిశగా జిల్లా పరిషత్ నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరుగుతుందని జెడ్పిటిసి డి.గంగరాజు పేర్కొన్నారు. బుధవారం టోకురు పంచాయతీ బగ్మరవలసలో డ్రైనేజీ నిర్మాణానికి సీపీఎం సర్పంచ్ కిల్లో. మొస్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, బగ్మరవలస గ్రామానికి డ్రైనేజీ నిర్మాణనికి జిల్లా పరిషత్ విధులు రూ.5 లక్ష్యాలు కేటాయించి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే సుమారు రూ 20. లక్షల పైగా నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు మాజీ సర్పంచ్ సార దొన్ను, పంచాయతీ కార్యదర్శి నక్క. రవికుమార్, సచివాలయం సిబ్బంది శివ రవికుమార్, అమ్మలు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, మండల నాయకులు జి.దేవన్న, వార్డు మెంబర్ పి. లక్ష్మరావు .ప్రసాద్, భీమరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అరకులోయ: ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నూతనంగా నియమించబడిన డాక్టర్ డి.వి.జి శంకర్రావుని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభా సోమేశ్వరి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్ర రామలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ నగరంలోని ఎస్టీ కమిషన్ చైర్మన్ స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు సమస్యలపై చర్చించారు.

అభినందిస్తున్న డైరెక్టర్, సభ్యురాలు

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి-అరకులోయ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు మరమ్మతు చేపట్టాలని అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత డిమాండ్ చేశారు. బుధవారం అరకులోయకు వచ్చిన ఆమె ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డును ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అరకులలో ఇటువంటి రహదారి ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. ఈ రోడ్డు మార్గంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, టూరిజం అతిథి గృహాలు, ఐటిడిఏ అతిథి గృహాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ కనీసం స్పందించక పోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న గీత

ముంపు గ్రామాల సమస్యలపై ఐటిడిఎ పిఒకు వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలో పోలవరం ముంపునకు గురవుతున్న గ్రామాల సమస్యలపై సిపిఎం నాయకులు బుధవారం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. ముంపునకు గురైన సుమారు 12 గ్రామాల ప్రజలకు భూమి ప్యాకేజీ ఇవ్వలేదని, ఇందులో అధిక శాతం గిరిజనుల భూమి మునిగి పోతుందని, భూమి ప్యాకేజీ తక్షణమే ఇవ్వాలని కోరారు. తరచూ వరదలు వస్తుండడంతో పంటల సాగుకు వీలు లేకుండా సకాలంలో వ్యవసాయం చేయలేదని పరిస్థితి ఉందని, అందువలన భూమికి నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వరదలు సంభవిస్తే మండలంలోని శబరి ఏరియాకు సంబంధించి సుమారు 20 గ్రామాలకు కరెంటు సౌకర్యం నిలిచిపోతుందని, గతేడాది వరదల సమయంలో నెల రోజుల పాటు కరెంటు లేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అందువల్ల విద్యుత్ లైన్‌ను ఆర్ అండ్ బి రోడ్డు వెంట వేయాలని కోరారు. దీనిపై గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళామని గుర్తు చేశారు. బొజ్జరాయిగూడెంలో మిగిలి ఉన్న 22 మంది యువతీ యువకులను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అర్హులుగా గుర్తించి ప్యాకేజీ ఇవ్వాలన్నారు. భూమికి భూమి ఇంకా చూపించలేని ఏడుగురు రైతులకు వెంటనే భూమిని చూపించాలని విజ్ఞప్తి చేశారు. మిగతా వారందరికీ ఇచ్చిన భూమిలో ఉన్న రాళ్లు, చెట్లను తొలగించి చదును చేసి సాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. 2022 వరదల్లో మునిగిన ట్రాన్స్‌ఫార్మర్ల వలన విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ వస్తుందని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2018లో జల్ జీవన్ మిషన్ ద్వారా మండలంలో మంజూరు చేసిన 60 బోర్లకు సోలార్ పేట్లుగాని, విద్యుత్‌లైన్‌గాని ఏర్పాటు చేయాలన్నారు. వీటికి సానుకూలంగా స్పందించిన పిఒ సమస్యల పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, పెద్దార్కూర్ ఎంపీటీసీ ధర్మల అమ్మాజీ, సర్పంచ్ మడకం నాగమణి, కూటూరు సర్పంచ్ బొగ్గ వెంకమ్మ, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, జిల్లా నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు బాబు బొర్రయ్య, నాయకులు నానుపల్లి వెంకటేశ్వరరావు, పాండురామయ్య, సోడే సుమన్ పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు

మహిళా పోరుయాత్రను జయప్రదం చేయండి

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి

ప్రజాశక్తి- చింతూరు

హింసపై పోరుయాత్ర పేరుతో ఈ నెల 28 నుండి ఆగస్టు 9వ తేదీ వరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మహిళా జాతాను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి పిలుపునిచ్చారు. ఐద్వా ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సమావేశంలో కుంజా రాధ అధ్యక్షతన బుధవారం చింతూరులో జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రమణి మాట్లాడుతూ మహిళలపై దాడులు, హింస రోజు రోజుకు పెరిగి పోతున్నాయని, వీటిని అరికట్టడానికి సమాజంలోని అందరూ పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీలతను పెంచి పోషిస్తున్నాయని, అందుకే ఈ దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సామాజిక రుగ్మతలను నివారించేందుకు, ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఐద్వా ఈ యాత్రను చేపట్టిందని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో కూడా మహిళలపై జరుగుతున్న దాడులు, హింసకు వ్యతిరేకంగా మహిళలు, ప్రజలంతా పోరాటాల్లోకి రావాలని, ఇక్కడ జరిగే జాతాలో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జాతాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు ముర్రం రంగమ్మ, కారం లక్ష్మి, జ్యోతి, సోయం వీరమ్మ, యెడమ సుబ్బమ్మ, కారం జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా జాతా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వాలంటీర్ల నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

గ్రామ, వార్డు వాలంటీర్ల గురించి ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గ్రామ వాలంటీర్లు బుధవారం రాజవొమ్మంగి అల్లూరి జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పవన్ కల్యాణ్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాలంటీర్ల గురించి నిరాధారమైన ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. గ్రామస్థాయిలో విశేష సేవలు అందిస్తున్న గ్రామ వాలంటీర్లపై నిందలు వేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ మాటల్లో వాస్తవాలు గ్రహించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాటల్లో వాస్తవాలను గిరిజన ప్రజలు అర్థం చేసుకోవాలని ఆ పార్టీ మండల నాయకులు అన్నారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎపిలో నానాటికీ హ్యూమన్ ట్రాపింగ్ కేసులు పెరగడానికి పౌరుల వ్యక్తిగత సమాచారానికి సంబంధం ఉందని, పౌరుల వ్యక్తిగత డేటా దుర్వినియోగానికి గురౌతుందని, వాలంటీర్లు ద్వారా ప్రభుత్వానికి చేరవేసే సమాచారం థర్డ్ పార్టీ అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్లిపోవడం ప్రమాదకరమని, అది నేరమయ వ్యవస్థను పెంచేలా ఉందని పవన్ కల్యాణ్ అన్నారని తెలిపారు. కాని కొన్ని మీడియా ఛానల్స్ దానిని వక్రీకరించాయన్నారు. వైసిపి గిరిజన ప్రజాప్రతినిధులు లేని పోని పత్రిక ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ మాత్రం స్పందించే సమర్థత వారికి ఉంటే గిరిజన జాతికి వ్యతిరేకంగా ప్రభుత్వం అసెంబ్లీలో బోయవాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చినప్పుడు వారికి ఎందుకు నోరు లేవలేదని ప్రశ్నించారు. వైసిపినేతలు సోషల్ మీడియాలో అసత్యాలు, అసభ్యకర భాష ప్రచారానికి కిరాయి ఐటి సైన్యాన్ని దించారని ఆరోపించారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అభద్రత భావంలో ఉన్నమాట గిరిజనులందరికీ తెలుసన్నారు. పవన్ కల్యాణ్ మాటల్లో అంతర్యం గ్రహించిన వాలంటీర్లు ఆలోచనలో పడ్డారని, తప్పు చేసినా వాళ్ళు భయంతో వణికిపోతున్నారని, వైసీపీ కార్యకర్తలుగా వ్యవహరించే వాళ్ళు మాత్రం రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జనసేన మండల నాయకులు సాగిన బుజ్జి బాబు, గూడెం లక్ష్మణ్, జుర్రా సూర్య ప్రకాష్, గోకిరి శ్రీను, వాసం సాయిబాబు, సిహెచ్.సిద్ధు, పురా రాజేష్, బుజ్జి బాబు, నత్తూరి శీను బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన మండల నాయకులు

వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:రాష్ట్ర ప్రజలకు నిరంతరం సేవలు అందించడంలో ముఖ్య భూమిక పాత్ర వహిస్తూ అలుపెరుగని సేవలు అందిస్తున్న గ్రామ వార్డు వాలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అర్థరహితంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ముత్తెం వినోద్ కుమార్ ఖండించారు. బుధవారం ఆయన స్థానికులు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రజలకు వాలంటీర్లు చేస్తున్న సేవలను అభినందించాల్సింది పోయి అర్థ రహిత వాక్యాలు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని, లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేయడానికి కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చిన్నారులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని పోతంగి గ్రామంలోని చిన్నారులకు బుధవారం హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ రాష్ట్ర ఏజెన్సీ మహిళా అధ్యక్షురాలు కే.కృష్ణకుమారి ఆధ్వర్యంలో బట్టలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిరుపేదలకు ఎంతో కొంత సాయం అందించాలన్న ఉద్దేశంతో హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అరకులోయ:స్థానిక జిల్లా. ప్రభుత్వ రెసిడెన్షియల్ ఐటిఐలో 2023-2024 విద్యా సంవత్సరంలో వివిధ ట్రేడ్‌లలో రెండో విడతలో కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అరకులోయ ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ అండ్ కన్వీనర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ అప్లికేషన్‌ను ఈ నెల 31లోగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన అన్నారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో ధరఖాస్తు చేసి, సీటు రాని అభ్యర్థులు కూడా మరల కొత్తగా ఆన్లైన్‌లో ధరఖాస్తు సమర్పించాలన్నారు. ఆన్లైన్ చేసుకున్న అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఆగస్టు 1 సాయంత్రం 5గంటల లోపు తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయింకోవాలన్నారు. ఆగస్ట్ 03 న కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు.

విశాఖపట్నం పోర్టు, హెచ్‌పిసిఎల్ మధ్య ఎంఒయు

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖపట్నం పోర్టు అథారిటీ, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మధ్య ఎంఒయు కుదిరింది. పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, హెచ్‌పిసిఎల్ రిటైల్ సిజిఎం సింగుపల్లి హరిప్రసాద్ ఈ ఒప్పంద పత్రాలపై పోర్టు కార్య నిర్వాహక కార్యాలయంలో బుధవారం సంతకాలు చేశారు.

ఒఎస్‌టిటిలో రెండు అదనపు బ్రెస్టింగ్ డాల్ఫిన్స్ నిర్మాణం కోసం ఒప్పందం జరిగింది. రూ.13.36 కోట్లు ఖర్చు చేయనున్నారు. మధ్యస్థ నౌకలను హ్యాండిల్ చేసేందుకు అనువుగా ఈ బెర్తు సామర్థ్యాన్ని 8.3 ఎంఎంటిపిఎ నుంచి 15 ఎంఎంటిపిఎ వరకు ఈ ఒప్పందంలో భాగంగా పెంచనున్నారు. పనులు అప్పగించినప్పటి నుంచి 18 నెలల కాలంలో ఇది అందుబాటులోకి రానుంది.

స్థాయీ సంఘం ఎన్నికల బరిలో 20 మంది

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలకు వైసిపి, టిడిపి తరుపున చెరో 10 నామినేషన్లు వేశారని, వాటిలో ఎటువంటి అభ్యంతరాలు లేకపోవడంతో వారందరినీ అర్హులుగా ప్రకటించినట్లు జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, 19వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రకరకాల పేర్లతో అదానీ మోసాలు

• స్థానికేతరులకు ఎర్రతివాచీ

దీక్షలో కూర్చున్న కార్మికులు (ఫైల్)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒకే యాజమాన్యం కింద ఉన్న గంగవరం పోర్టు లిమిటెడ్ (జిపిఎల్)ను అదానీ చేతిలోకి 3ఏళ్ల క్రితం వచ్చాక జిపిఎల్, జిపిఎస్ఎల్, జిపిసి, ఎజిపిపిఎల్ వంటి పేర్లతో కార్మికులను పోర్టులో చేర్పించుకుంటూ వేతనాల విషయంలో ఘోరంగా శ్రమదోపిడీకి అదానీ యాజమాన్యం పాల్పడుతోంది. ఏ కార్మిక చట్టాలను అమలు చేయకుండా, లేబర్ అధికారులను దగ్గరకు రానియ్యకుండా అదానీ ఢిల్లీ నుంచి గల్లీ దాకా మేనేజ్ చేస్తున్నాడు. బెర్త్ ఆపరేటర్స్‌తో పాటు యాడ్ ఆపరేటర్స్ సమానంగా పనిచేస్తున్నప్పటికీ యాడ్ ఆపరేటర్స్ వేతనాలను అతితక్కువగా నిర్ణయించి చెల్లిస్తున్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్ రైల్వే, ఎన్ఎంఆర్ వంటి వివిధ డిపార్టుమెంట్లలో కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు వర్తింపజేయకుండా ఉండేందుకు తక్కువ రోజులు ఎక్కువ పనిచెబుతూ వారి శ్రమను దోచుకుంటోంది అదానీ పోర్టు. వందల సంఖ్యలో ఈ విభాగాల్లో కార్మికులు విధుల్లో ఉంటున్నారు.

స్థానికేతరులకు ఎర్రతివాచీ...

అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం తాజాగా ఒక కంటైనర్ టర్మినల్‌ను నిర్మిస్తోంది. 2023లో దీన్ని ప్రారంభింపజేయనుంది. ఏపిలోని మారుమూల ప్రాంతాలు సహా చుట్టుపక్కల రాష్ట్రాల కంటైనర్ వ్యాపారం అంతటినీ ఈ టర్మినల్ లాగేసే యత్నాల్లో ఉంది. వైజాగ్ పోర్టులో 20 బెర్తులకు ఇప్పటికే 11 బెర్తులు పిపిపిలోకి వెళ్లిపోయాయి. ప్రభుత్వ వైజాగ్ పోర్టును మింగేసేలాగ అదానీ పావులు కదుపుతున్నాడు. అన్నింటికంటే ముఖ్యంగా స్థానికులను ఎలాగోలా బయటకు నెట్టేసే ప్రయత్నాలు అదానీ తీవ్రం చేస్తూ కార్మిక చట్టాలు, కనీస వేతనాలు లేకుండా చేస్తున్నాడన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

అదానీకి ఎలా దఖలు పడింది?

గంగవరం పోర్టు లిమిటెడ్ (జిపిఎల్) పేర డివిఎస్ రాజు కన్సార్టియం ఆధ్వర్యాన ఉండేది. ఇందులో డివిఎస్ రాజుకు 58.1శాతం, విండీలేక్ సైడ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు 31.15శాతం, రాష్ట్ర ప్రభుత్వానికి 10.04శాతం వాటాలున్నాయి. డివిఎస్ రాజు, విండీ లేక్ సైడ్ వాటాలను అదానీ పోర్ట్స్ స్పెషల్ ఎకనమిక్ జోన్ లిమిటెడ్ (ఎపిసెజ్) కొనుగోలు చేసింది. డివిఎస్ రాజు వాటాను రూ.3604కోట్లకు, విండీ లేక్ సైడ్ వాటాను రూ.1954కోట్లకు అదానీ గ్రూప్ కొనేసింది. రాష్ట్ర ప్రభుత్వం 2021లో తన 10శాతం వాటాను అదానీకి వదిలేసింది.

గంగవరంలో పోర్టు నిర్మాణంతో తమ బతుకుల్లో మార్పు వస్తుందని గంగవరం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన వేల సంఖ్యలో మత్స్యకారులు ఆశించి భంగపడ్డారు. వందల ఎకరాలప్పగించిన మత్స్యకారుల్లో కేవలం 300 మందికి మాత్రమే జిపిఎస్‌లో ఉపాధి లభించింది. 771 మందికి ఉద్యోగాలివ్వాలని అప్పట్లోనే హైకోర్టు వెల్లడించింది. కానీ పోర్టు యాజమాన్యం అమలు చేయలేదు. సిఐటియు ఇతర సంఘాల మద్దతుతో కార్మికులు, భూములిచ్చిన రైతులు, మత్స్యకారులు తాజాగా పోరాటంలోకి దిగారు.

ప్రజా ఉద్యమంగా విశాఖ ఉక్కు పోరాటం

ప్రజాశక్తి-ఉక్కునగరం : రాష్ట్రంలోని రైతు, ప్రజా, యువజన సంఘాలను కలుసుకొని ప్రతి జిల్లాలోనూ సమావేశాలు నిర్వహించి వారిని భాగస్వామ్యం చేసి స్టీల్‌ప్లాంట్ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చడానికి తగు చర్యలు తీసుకుంటున్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, శ్రీనివాసరావు చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 881వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎల్ఎంఎం, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి వారు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లోని ప్రతి విభాగంలో పోరాట కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విభాగాల పోరాట కమిటీ నాయకులకు బాధ్యతలు అప్పగించడం ద్వారా దీక్షా శిబిరంలో కార్మికుల సంఖ్యను పెంచవచ్చున్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను సిద్ధం చేసి, ప్రజా ఉద్యమాలను నిర్మించనున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

విశాఖపట్నం-బనారస్ ప్రత్యేక రైలు సేవల పొడిగింపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వారణాసి వెళ్ళే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం-బనారస్-విశాఖపట్నం వారాంతపు ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని నిర్ణయించింది. 08588 విశాఖపట్నం- బనారస్ వీక్లీ స్పెషల్ రైలు ఈ నెల 19 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు ప్రతి బుధవారమూ మధ్యాహ్నం 12:30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 16:30 గంటలకు బనారస్ చేరుకుంటుంది. 08587 బనారస్ -విశాఖపట్నం వీక్లీ స్పెషల్ ఈ నెల 20 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ప్రతి గురువారమూ సాయంత్రం 18.00 గంటలకు బనారస్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్ళు సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగూడ, కేసింగ, టిట్లాగఢ్, బలంగీర్, బర్గర్‌రోడ్, సంబల్‌పూర్, ఝర్సుగూడ, రూర్కెలా, హతియా, రాంచీ, మురి, బర్కకానా, లతేహార్, గర్వారోడ్, సగరోడ్, సజీ, భాబువా రోడ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వారణాసి స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తాయి.

నేరాలు ఘోరాలు

ఘాట్ రోడ్డులో పలు చోట్ల ప్రమాదాలు

ప్రజాశక్తి-అనంతగిరి:అనంతగిరి ఘాట్ రోడ్డులో ఎదురు ఎదురుగా వచ్చిన రెండు కార్లు ఢీ కొనాయి. మర్దగుడ, బీసుపురం సమీపం సాపరాయి కాఫి తోటల వద్ద బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రెండు కార్లు ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ప్రయణికులకు ఎటువంటి గాయాలు తగలక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అలాగే అనంతగిరి, ములియగుడ సమీపంలో స్కూటి, ఆటో ఢీ కొన్నాయి. స్కూటిపై ఉన్న వ్యక్తి అప్పన్నకు స్వల్పగాయాలు అయ్యాయి.

ఘాట్ రోడ్డులో ఢీ కొన్న రెండు కార్లు

ఆదివాసీ ప్రాంతాల్లో తాగునీటి కొరతపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సీలేరు, శబరి నదుల నుంచి నీటిని గోదావరిలోకి తరలించడం వల్ల ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో తీవ్ర తాగు నీటి కొరత ఏర్పడుతోందని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదుచేసినట్లు యుపిఎస్‌సి మాజీ చైర్మన్, మాజీ వీసీ ప్రొఫెసర్ కెఎస్.చలం తెలిపారు. ఇక్కడి నీటిని వినియోగించుకుని, గిరిజన ప్రాంతాలను పట్టించుకోకుండా గోదావరి ద్వారా తమ వనరులను కృష్ణాతో కలుపుతోందని కమిషన్‌కు వివరించినట్లు పేర్కొన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి నీటిని తరలిస్తున్నారని, ఉపనదుల నీటిపై గిరిజనులు చట్టబద్ధంగా హక్కులను కలిగి ఉన్నారని వివరించారు. దీంతో కమిషన్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ కార్యదర్శికి నోటీసు జారీ చేసిందని కెఎస్.చలం తెలిపారు. దీనిపై నివేదిక ఇవ్వాలని నోటీసులో విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు సూచించిందని పేర్కొన్నారు. ఎడమ కాలువ పక్కన నివసించే గిరిజనుల తాగునీటి అవసరాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. 4 వారాల్లోగా తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు. తీవ్రమైన మానవ హక్కుల సమస్యపై ఎన్‌హెచ్‌ఆర్‌సి తీసుకున్న చొరవను ప్రొఫెసర్ కెఎస్.చలం అభినందించారు.

యుపిఎస్‌సి పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : యుపిఎస్‌సి నిర్వహించనున్న కంబైన్డ్ మెడికల్ పరీక్షకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులుతో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంబైన్డ్ మెడికల్ పరీక్ష ఈ నెల 16వ తేదీ ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. జిల్లా నుంచి 892 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అంతటా 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకొనేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటుచేయాలని, ఆరోగ్య సిబ్బందిని ఉంచాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పోలీస్, జివిఎంసి, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ, మెడికల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ఆసుపత్రిలో అధునాతన ఆపరేషన్ థియేటర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలోని డివిజనల్ రైల్వే హాస్పిటల్ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి బుధవారం ప్రారంభించారు. ఈ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్ ఏర్పాటు రైల్వే రోగులు, వ్యవస్థీకృత సంఘాలు, సిబ్బందికి సేవలు అందించనుంది.

ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి వైద్యునికి అరుదైన గౌరవం

డాక్టర్ గుళ్ళపల్లి ఎస్.రావు

ప్రజాశక్తి - ఆరిలోవ :2023 సంవత్సరానికి యుకెలోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో నిర్వహించిన 106వ ఆక్స్‌ఫర్డ్ ఆప్తాల్మాజికల్ కాంగ్రెస్‌లో పాల్గొని, ప్రసంగించే అరుదైన అవకాశం, గౌరవం ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ స్థాపనాధ్యక్షులు డాక్టర్ గుళ్ళపల్లి ఎస్.రావుకు దక్కింది. 106 సంవత్సరాల చరిత్రలో ఈ సదస్సులో ఉపన్యసించిన మొట్టమొదటి భారతీయ ఆప్థమాలజిస్ట్‌గా డాక్టర్ రావుకు అవకాశం దక్కడం దేశానికి గర్వకారణమని పలువురు అభినందించారు. ఆక్స్‌ఫర్డ్ కాంగ్రెస్ సదస్సులో కార్నియా కేర్ సిస్టమ్, ఎవల్యూషన్ అనే అంశంపై చేసిన ప్రసంగం పలువురి ప్రశంసలు అందుకుంది. సదస్సుకు డాక్టర్ రావు ప్రసంగం హైలెట్‌గా నిలిచిందని ఆక్స్‌ఫర్డ్ ఆప్తమాలజికల్ కాంగ్రెస్ మాస్టర్ డాక్టర్ టిమోటి డాబ్స్ కొనియాడారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి- సీతమ్మధార :పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీతమ్మధార జంక్షన్‌లో ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి యూనియన్ రాష్ట్ర వర్కింగ్‌కమిటీ సభ్యులు జి.వామనమూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన విద్యుత్తు సంస్కరణను అమలుచేస్తూ, ప్రజలపై ఆర్థిక భారాలు వేసే విద్యుత్తు చార్జీల పెంపు వంటి నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరిగిన వంటగ్యాస్, పెట్రో ఉత్పత్తులు, నిత్యావసరాల ధరలను భరించేందుకు సరిపడడా ఆదాయం లేక అర్థాకలితో జీవిస్తున్న ప్రజలపై ఇలా ఛార్జీలు, పన్నుల భారం మోపడం దుర్మార్గమని, తక్షణమే దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే దశలవారీ ఆందోళన తప్పదని హెచ్చరించారు. ధర్నాలో సిపిఐ నేతలు రావికృష్ణ దేవుడు, నాయుడు, బి ఈశ్వరరావు, కె.రాము, కె.కోటి, డి.రమణ, గణేష్‌కుమార్ జి నారాయణరావు, ఎస్‌కె నాగూరి పాల్గొన్నారు.

మహిళా సాధికారితతోనే గుర్తింపు

ప్రజాశక్తి -ములగాడ : మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని, తద్వారా సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఫస్టియర్ డిగ్రీ విద్యార్థినులకు మహిళా సాధికారతపై ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలు ఉన్నత విద్యావంతులై నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని కోరారు. కళాశాల అధ్యాపకురాలు వై.ప్రేమలత మాట్లాడుతూ, మహిళా సాధికారతకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగినప్పుడే సమాజంలో తగిన గుర్తింపు పొందగలరన్నారు. కళాశాల ప్రతినిధి సిస్టర్ జానీస్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో లెక్చరర్లు ఎ.ఆదిలక్ష్మి,వి. అంజలీదేవి, డి.జయశ్రీ, ఎ.సంధ్యారాణి పాల్గొన్నారు. సమాజంలో మహిళల పాత్రపై అభిప్రాయాలను పంచుకున్నారు.

'గడపగడపకు' 100 రోజుల సంబరాలు

ప్రజాశక్తి -కరాస: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి 100 రోజులు పూర్తయిన సందర్భంగా మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోనిపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మహిళల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించిన తర్వాత సిఎం జగన్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. గడపగడపకు వెళ్లి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టానన్నారు. అర్హులకు పింఛన్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషిచేశానన్నారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పింఛన్లు పొందే అవకాశం లేని 50మందికి తన సొంత నిధులతో నెలనెలా పింఛన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి పరిశీలకులు ఎస్ఎ రెహమాన్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు, వార్డు వైసిపి అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలు, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'జగనన్న సురక్ష'

కొయ్యూరులో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీలేరులో సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాశక్తి- కొయ్యూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామాల్లో విస్తృతంగా జరుగుతుంది. కొయ్యూరు మండలం మాకవరం గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 619 టోకెన్లు జనరేట్ చేయగా 568 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వివిధ సర్టిఫికెట్లు లేని కారణంగా సంక్షేమ పథకాల పొందని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. గ్రామంలో 58 మంది పిల్లలు ఉన్నా ఒకరే టీచర్ ఉన్నారని, అదనంగా మరో టీచర్‌ను అవసరం ఉందని, ఇదివరకే కలెక్టర్‌కు తెలియజేశానని తెలిపారు. సిఆర్‌టిని రెన్యువల్ చేయడం గాని, కొత్తగా తీసుకోవడం గాని చేస్తామని చెప్పారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, స్థానిక సర్పంచ్ కూడా చింతల్లి, ఎంపిటిసి పొగుడు రత్నం, నాయకులు కూడా రాజబాబు, వైసిపి మండల అధ్యక్షులు జల్లిబాబులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, గాడి నాగమణి, బండి సుధాకర్, వనం బాబు, శేఖర్, బాబురావు, గజ్జయదొర, దిలీప్, మహేష్, మహిళానేత గౌరీ, సర్పంచ్‌లు శోభన్, సెగ్గె రమాదేవి, ఎంపిటిసి మల్లికార్జున్ పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం దారకొండలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జీకేవీధి ఎంపీపీ కుమారి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దారకొండ సెక్టర్-1లో 563 దరఖాస్తులు నమోదు కాగా 83 మందికి, దారకొండ సెక్టార్-2లో 406 దరఖాస్తులకు 232 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లును ఎంపీడీవో ఉమహేశ్వరరావు, ఎంపిపి కుమారి, సర్పంచి రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, లొతా దేవుడు, జీకే వీధి తహశీల్దారు ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ కుమారస్వామి, విస్తరణ అధికారి జె.పాపారావు, కార్యదర్శి శ్రీనివాస్, దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు, ఎంపీటీసీ మాడి రామన్న, వైసిపి నాయకులు పిల్ల బుజ్జి, కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : సమస్యలు సత్వర పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి అన్నారు. మండలంలోని రాజవొమ్మంగి సచివాలయ-2, వాతంగి సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యఆచారి ఆధ్వర్యంలో జరిగాయి. ఆయా గ్రామ సర్పంచ్‌లు గొల్లపూడి రమణి, బి భవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లాగరాయి సర్పంచ్ మిరియాల ఘనలక్ష్మి, వైస్‌ఎంపిపిలు సిహెచ్ చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ అల్లి సత్యనారాయణ, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు, కో ఆప్షన్ సభ్యులు అడపా కామేష్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో సర్టిఫికెట్లనుఅందజేస్తున్నఎంపిపి, జెడ్‌పిటిసి

స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతికి పౌర సత్కారం

ప్రజాశక్తి- ఉక్కునగరం : అగనంపూడి సిడబ్ల్యూసిలో అగనంపూడి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ భద్రత విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన దువ్వాడ రామప్రసాద్‌ను స్థానికులు సన్మానించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వర్క్స్, ప్రాజెక్ట్స్, రోడ్ సేఫ్టీ, మైన్సు, సేఫ్టీ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు హెచ్‌ఒడి గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సత్కరించారు. అగనంపూడి సిడబ్ల్యూసి కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన జరిగిన సన్మానసభలో ఎడిసి చైర్మన్ బలరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. సన్మానగ్రహీత రాంప్రసాద్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా విధుల్లోచేరి, పలు విభాగాల్లో విధులు నిర్వర్తించి, ఇపుడు సేఫ్టీహెడ్‌గా నియమించబడ్డానని, ప్లాంట్‌లోని అన్ని విభాగాలపై పూర్తి అవగాహన ఉన్న తాను రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెడతానని, ఫ్యాక్టరీ పురోభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో వైసిపి నేత తమ్మిన చైతన్య, టిడిపి నేత అలమండ శ్రీనివాసరావు, జనసేన నేత మోటూరి వెంకటరమణ, ఉక్కు ఎఐటియుసి నేత సాయిన సన్యాసిరావు, ఇంటక్ నేత విందుల నారాయణరావు, సిఐటియు నేత ఆడారి వెంకటకృష్ణ, ఇపిఎస్ కన్వీనర్ విందుల వరహాలు, లయన్స్ క్లబ్ ప్రతినిధి ఎం మస్తానరెడ్డి, సిడబ్ల్యూసి ప్రతినిధి జనపరెడ్డి నర్సింగరావు, సత్యసాయి భజన మండలి ప్రతినిధులు బివి సుబ్బారావు, జాజుల మోహనరావు, సోలార్ ప్యానల్ ప్రతినిధి బి రాము ప్రజా సంఘల నేతలు విందుల మోహనరావు, దొడ్డిదేముడు పాల్గొన్నారు.

ముల్లుమెట్టలో సినిమా షూటింగ్ సందడి

సినిమా షూటింగ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి కొయ్యూరు: మండలంలోని డౌనూరు పంచాయతీ పరిధి ముల్లుమెట్ట గ్రామంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. అంబుల్ ప్రొడక్షన్స్ నిర్మాణ సారధ్యంలో గవిరెడ్డి శ్రీనివాస్ దర్శకత్వంలో సినీ నటులు బెనర్జీ, భరణిలపై కొన్ని సన్నివేశాలను బుధవారం చిత్రీకరిస్తున్నారు. ఈ ప్రాంతంలో తొలిసారిగా చిత్ర నిర్మాణం జరుగుతుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. మరో వారం రోజుల పాటు ఈ ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరుపుతామని డైరెక్టర్ తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సారా బట్టీలపై దాడులు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని లోదొడ్డి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీపై జడ్డంగి ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. సారాబట్టీని, సారా తయారీకి ఉపయోగించే పాత్రలను, సామగ్రిని ధ్వంసం చేశారు. ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే వెయ్యి లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. ఈ సందర్భంగా ఎస్ఐ షరీఫ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా సారాబట్టీలు నిర్వహించినా, అక్రమంగా సారా తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హైమాస్ట్ దీపాలు ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 85ం వార్డు పరిధి ఫార్మాసిటీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద హైమాస్ట్ లైట్లును గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు.వార్డు పరిధిలో ముఖ్యమైన కూడళ్లు, దేవాలయం, కమ్యూనిటీ హాల్ వంటి ప్రదేశాలలో త్వరితగతిన వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. రెండు నెలల్లో నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వార్డ్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ ఇల్లపు వరలక్ష్మి మాట్లాడుతూ వార్డుపరిధిలో విద్యుత్ దీపాల సమస్య పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపిజువాక నియోజకవర్గం ఇన్‌ఛార్జి తిప్పల దేవన్ రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యలమంచిలి అప్పారావు నాయకులు బోర సోమునాయుడు , గొల్లవిల్లి పైడిరాజు, శంకర్, వాసు, అప్పలరాజు పాల్గొన్నారు..